క్రీడా ప్రాంగణాలపై శ్రద్ధే లేదు..

- ఆటల్లో వెనకబడుతున్న చిన్నారులు
- సాధనకు మైదానాలు కరవు
- ఉన్నా అభివృద్ధి నోచుకోని వైనం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


మునగపాడులోని క్రీడామైదానం


పొనుగుపాడులోని క్రీడామైదానం

ఫిరంగిపురం: రోజులు మారాయి. క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మెరికలు ఉన్నా వసతులు లేవు. ఉన్నా ప్రోత్సహించేవారు ఉండరు.. క్రీడా మైదానాలు ఉంటే సామగ్రి ఉండదు. అన్ని ఉంటే అక్కడే వ్యాయామ ఉపాధ్యాయుడు ఉండరు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడి గురవుతున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యం ముఖ్యం, అది పాఠశాలల్లో క్రీడలద్వారానే సాధ్యమవుతుంది. నిత్యం పాఠాలు, పోటీపరీక్షలతో తలమునకలవుతుండే విద్యార్థులు తీవ్రంగా ఒత్తిడికి లోనవుతుంటారు. ఒత్తిడి తగ్గేందుకు వారికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని, నూతన ఉత్తేజాన్ని పొందుతారని వైద్యులు చెబుతున్నారు.

మండలంలో 56 పాఠశాలలు

మండలంలోని 18 గ్రామాల్లో 56 పాఠశాలలున్నాయి. అందులో 4వేల 460 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆరు జెడ్పీపాఠశాలలు, మూడుఎంపీయూపీ పాఠశాలలు, రెండు ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలలు, మూడు ఎయిడెడ్ ప్రైమరీ హైస్కూల్స్, 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

క్రీడా మైదానాలు ఎన్నాంటే..

మండలంలోని 18 గ్రామాల్లోని 56 పాఠశాలలకుగాను కేవలం రెండు పాఠశాలలకు మాత్రమే క్రీడా మైదానాలు ఉన్నాయి. వాటిలో పొనుగుపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన ఒకటి కాగా మునగపాడు గ్రామంలోని పాఠశాలకు క్రీడామైదానం ఉంది.

ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలోని కొద్దిపాటి స్థలం, సెయింట్‌ఆన్స్ బాలిక పాఠశాల, అమీనాబాద్ పాఠశాలల్లో కొద్ది పాటి స్థలంలో విద్యార్థులకు ఆటలు ఆడిస్తున్నారు. మిగిలిన పాఠశాలల్లో క్రీడామైదానాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. క్రీడాసమయం ఉన్నా ఆసమయంలో విద్యార్థులకు మాటలు, కథలతో కాలక్షేపం చేసే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

8మంది పీఈటీలు:

మండలంలోని కేవలం 8 పాఠశాలల్లోనే పీఈటీలు ఉన్నారు. ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్, సెయింట్‌ఆన్స్ గాల్స్ హైస్కూల్, వీఆర్‌బీ పాఠశాల అమీనాబాద్, నుదురుపాడు జెడ్పీ. మునగపాడు , పొనుగుపాడు, బేతపూడి, అల్లంవారిపాలెం పాఠశాలల్లో మాత్రమే పీఈటీలు ఉన్నారు.

విద్యార్థులకు కష్టాలు

క్రీడామైదానాల కొరతతో విద్యార్థులు పలు రకాల ఆటలకు దూరం అవుతున్నారు. కొన్ని పాఠశాలలకు వచ్చిన క్రీడాసామగ్రి క్రీడామైదానం లేక వినియోగించలేని పరిస్థితి నెలకొంది. క్రీడల్లో రాణిస్తే ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నా విద్యాశాఖ పట్టించుకోక పోవడంతో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఉందని అంటున్నారు. పాఠశాలకు సెలవల్లో సైతం క్రీడామైదానాలు లేక విద్యార్థులు సెల్‌ఫోన్లుకు బానిసలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖాధికారులు స్పందించి క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైదానాలు ఏర్పాటు చేయాలి



పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులకు పలురకాల ఆటలు నేర్పించలేని పరిస్థితి నెలకొంది. బేస్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, కోకో వంటి ఆటలు ఆడించాలన్నా తగినంత స్థలం లేని దుస్థితి. అధికారులు స్పందించి క్రీడామైదానాలు ఏర్పాటు చేయాలి.

–తియ్యగూర వీరారెడ్డి, వేమవరం

ఆరోగ్యానికి క్రీడలు దోహదం:



క్రీడలు ఆడటం ద్వారా విద్యార్థులు మానసికంగా ఉత్సాహంగా ఉంటారు. పలుపాఠశాలల్లో ఆటలు ఆడించే పరిస్థితి లేదు. ఉన్నా కొద్దిపాటి స్థలంలో ఆడించాల్సి వస్తుంది. క్రీడా మైదానాలు కేటాయిస్తే బాగుంటుంది.

– ఉడుముల పిచ్చిరెడ్డి, నుదురుపాడు

క్లుప్తంగా

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



మంగళగిరి: పట్టణంలోని ఇందిరానగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. హెల్త్ సెంటర్‌లో ఓపీ సేవలు ఎలా అందుతున్నాయి, ల్యాబ్‌లో రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారు, ఫార్మసీ అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యసేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలకు మంచి స్నేహితులు

తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు



తాడేపల్లిరూరల్: పోలీసులు ప్రజలకు మంచి స్నేహితులని తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ఆల్‌మదీనా పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ విధి నిర్వహణ, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవులకు కూడా కొన్ని హక్కులు ఉంటాయని, వాటిని చట్టపరిధిలో కాపాడడం పోలీసుల బాధ్యత అని, క్రిమినల్ ప్రొజీసర్, ఇండియన్ పీనల్ కోడ్‌పై అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి సెక్షన్లు ఉపయోగించిన కఠిన చర్యలు తీసుకుంటారో వివరించారు. పోలీసులు, చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో మంచి పౌరులుగా ఉంటూ జీవితంలో అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

అన్నవరంలో తెనాలి గాయనిల 'సంకీర్తన'

తెనాలి: పవిత్ర పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో స్వామి వారి తెప్పోత్సవం సందర్భంగా బుధవారం తెనాలి గాయనీమణులు సంకీర్తన గానం చేశారు. పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం రెండు గంటలసేపు అన్నమయ్య సంకీర్తనను గానం చేసి, ప్రేక్షకులను పరవశులను చేశారు. సంకీర్తన గురువు కొండపి వసుంధర, మారా లలిత కుమారి, మాజేటి వాసవి, గుబ్బా లక్ష్మీకుమారి, నంబూరు వినతి, లక్కరాజు కనకదుర్గ, కంభంపాటి లీలారత్నకుమారి గానం చేశారు. వీరికి తబలపై సాయి, కీబోర్డుపై పెద్దిరాజు వాయిద్య సహకారం అందించారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆత్మరక్షణ విద్య బాలికలకు అవసరం

తాడేపల్లిరూరల్: బాలబాలికలకు ఆత్మరక్షణ విద్యలు అవసరమని కేఎల్‌యూ 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక సూచించారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రతలో భాగంగా విద్యార్థినులకు ఆత్మరక్షణలో మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ఈ ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.నాగమణి మాట్లాడుతూ బయటకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు, ఉద్యోగినులను ఆకతాయిల వేధింపులకు గురిచేస్తున్న సందర్భంలో కరాటే లాంటి విద్యలు నేర్చుకుని ఉండడం వలన తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు. ఆత్మరక్షణ కోసం మీకు ప్రమాదం తలపెట్టే వారిని సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవడం వలన వారికి ఎటువంటి గాయాలైనా మీపై ఎటువంటి కేసులు పెట్టే అవకాశం లేదని వివరించారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించారు.


విద్యార్థినులకు ఆత్మరక్షణ గురించి వివరిస్తున్న కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లు

బాలల దినోత్సవం సందర్భంగా పోటీలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు బుధవారం పోటీలు నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు, మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి, తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులోని ప్రభుత్వ పాఠశాలలోని 6,7,8,9 తరగతుల విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, రీజనింగ్ వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నూతక్కి పాఠశాలకు చెందిన శశాంక్, సుశాంక్, ధన్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ సీఈఓ, సాక్ డైరెక్టర్ సాయి విజయ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖర్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, స్టూడెంట్ మెంటర్‌గా పీవీ సత్యనారాయణ, శివ, స్టూడెంట్ కో ఆర్డినేటర్లుగా ఉదయ్, వంశీ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న సాక్ డైరెక్టర్ సాయి విజయ్

ప్రజాపోరు ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టాసారంగా పెంచిన నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో సీపీఎం ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ప్రజాపోరు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి.విజయ భాస్కర్ రెడ్డి, వై.బర్న బాస్, మేరీ, రామకృష్ణ పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రజాపోరు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో కరపత్రాల పంపిణీ మరియు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలపై మరింత భారాన్ని వేసేందుకు చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిత్యావసరా ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కుంచనపల్లి గ్రామశాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, జలప్రకాష్, బిరుదుగడ్డ మోషే పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం


తాడేపల్లిరూరల్: యూటీఎఫ్ దుగ్గిరాల మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల నేపథ్యంలో అందరూ కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం విద్యావిధానంలో కార్పొరేటీకరణ, మానిటైజేషన్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులను చైతన్యవంతం చేయడానికి ప్రజలతో కలసి ప్రభుత్వ విద్యను కాపాడడానికి కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎంవీ సీతారామయ్య, పి.మాలకొండయ్య, పి.బసవపున్నయ్య, ఎస్.తోమాసయ్య, బి. ఫాతిమా మేరి, పోతులూరయ్య, యు.రమేష్, కె.ఉదయభానులను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన డి. నాగకృష్ణకుమారి, కె.భాస్కరరావులను ఘనంగా సత్కరించారు. అనంతరం యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా కె.కామాక్షి, సహాధ్యక్షులుగా ఆర్‌వీ ప్రసాద్, జి.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి. చలపతిరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎండీ హుస్సేన్, మరియు 9 మంది కార్యదర్శులను, 8 మంది జిల్లా కౌన్సిలర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల పరిశీలకులుగా ఎండీ గయాసుద్దౌలా, వి.సాంబశివరావు వ్యవహరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కె.నాగ కుసుమ కుమారి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పెదకాకాని: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలో బుధవారం ఆమె పర్యటించారు. పెదకాకాని, కొప్పురావూరు, ఉప్పలపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, పశువుల పాకలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రూఫ్ టాప్ రైయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను పరిశీలించారు. పెదకాకాని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మిస్తున్న రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్స్ నిర్మాణాన్ని, పోషణ్ వాటికకు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ చిన్నారుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ ప్రకారం చిన్నారులకు ఇంగ్లిష్ అక్షరాలు, పాటలు, రెయిమ్స్, రంగులపై పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా బోధన చేయాలని టీచర్‌కు సూచించారు. కేంద్రంలోని సరుకులు, సంపూర్ణ పోషణ, బాలామృతం కిట్లను పరిశీలించారు. సక్రమంగా సరుకులు సరఫరా అయ్యేలా సూపర్వైజర్లు, ఐసీడీఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. పెదకాకానిలో పుష్పరాజ్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్ని పరిశీలించారు. వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు శివాలయం వీధిలో మాంసం విక్రయ దుకాణాలను తొలగించాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. ఎస్సీల శ్మశాన వాటికకు స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పెదకాకాని అంగన్‌వాడీ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కొప్పురావూరులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల పాకను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులకు చెందిన పశువుల వివరాలు, వాటి పాల ద్వారా వస్తున్న ఆదాయం గురించి తెలుసుకున్నారు. గ్రామంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని, సమీపంలో ఉన్న పొగాకు ఫ్యాక్టరీ వల్ల కాలుష్యం వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతానికి నూతనంగా నిర్మిస్తున్న రైల్వే లైను గ్రామం మధ్యలో నుంచి వెళుతోందని, అవకాశం ఉంటే ఎలైన్‌మెంటు మార్చాలని కోరారు.
- ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న రూఫ్ టాప్ రైయిన్ వాటర్ హర్వేస్టింగ్ స్టక్చర్ నిర్మాణాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థిని, స్వర్ణాంధ్ర విజన్ ప్రేరణలో బహుమతులు సాధించిన విద్యార్థినితో పాటు జాతీయస్థాయిలో వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయిన విద్యార్థినులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో సచివాలయం ఉద్యోగులు అధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల జియో ట్యాగింగ్, ఎస్‌సీపీ సర్వేను పరిశీలించారు.

పండ్ల వ్యాపారుల బడా మోసం బట్టబయలు

- కిలోకు 150–200గ్రాముల తూకంలో తగ్గుదల
- తూనికలు కొలతల శాఖ ఆకస్మిక తనిఖీలు
- అధికారులను చూసి పరారైన తోపుడుబండ్ల వ్యాపారులు
- జాయింట్ కంట్రోలర్ నేతృత్వంలో 26 కేసులు నమోదు



తెనాలి: పట్టణంలో పండ్ల వ్యాపారం ఇష్టారాజ్యమైంది... తోపుడుబండ్లపై చిరువ్యాపారాలు చేసేవారే పెద్దమోసానికి పాల్పడుతున్నారు...తప్పుడు తూకాలతో వినియోగదారులను అందినకాడికి దోచుకుంటున్నారు. ఏకంగా కిలోకు 200 గ్రాముల వరకు తూకం తక్కువ ఉన్నాయంటే కొనుగోలుదారులు ఎంతగా నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంవీఎస్ మాధురి, ఇద్దరు అసిస్టెంట్ కంట్రోలర్లు, నలుగురు ఇన్‌స్పెక్టర్లతో కలిసి బుధవారం పట్టణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఇది తూకం మోసం బట్టబయలైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని కూరగాయల మార్కెట్, మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, నెహ్రూరోడ్డులో విస్తృతంగా తనిఖీలు చేశారు. మొత్తం 26 కేసులు నమోదుచేశారు. ముఖ్యంగా తోపుడుబండ్లపై పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు పలువురు వీరిని చూసి, ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్లను తీసుకుని పరారయ్యారు. మిగిలినవారి తూకాలను తనిఖీ చేశారు. కిలోకు 150 నుంచి 200 గ్రాముల తక్కువ రావడాన్ని గమనించి, ముగ్గురు పండ్ల వ్యాపారులపై కేసు పెట్టారు. వీటితోపాటు కూరగాయల మార్కెట్, స్టీలు, ఇత్తడి వస్తువుల షాపులు, స్వీట్ షాపులు, బేకరీలను తనిఖీ చేశారు. తూకపు రాళ్ల తూనికలు వాడుతున్న వ్యాపారులపై అయిదు కేసులు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లకు స్టాంపు లేని కారణంగా 14 కేసులు, మెటల్ స్టోర్స్‌పై ఒకటి, స్వీట్‌షాపుల్లో తనిఖీలతో తూకం తక్కువ కారణంపై ఒకటి, స్వీటు ప్యాకెట్లపై డిక్లరేషన్ లేకపోవటంపై మరో కేసు నమోదుచేసినట్టు జాయింట్ కంట్రోలర్ మాధురి వెల్లడించారు. పౌరసరఫరాలశాఖ మంత్రికి చెందిన పట్టణంలోనే పండ్ల వ్యాపారులు ఇంతగా తూకం మోసాలకు పాల్పడటాన్ని చూసి ఆమె విస్మయం వ్యక్తంచేశారు. మరోసారి తప్పకుండా ఇక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తామని స్పష్టంచేశారు. ఈ తనిఖీల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు జి.కొండారెడ్డి, ఎన్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు కె.నాగేశ్వరరావు (చీరాల), శివశంకరరావు (నరసరావుపేట), జాన్‌సైదా (సత్తెనపల్లి), శేషసాయి (తెనాలి), సునీల్‌రాజు (గుంటూరు) పాల్గొన్నారు.

మూడురోజులుగా విద్యుత్‌కు అంతరాయం

తాడికొండ: అధికారుల వైఫల్యం, నిర్వహణ లోపం కారణంగా మండల కేంద్రమైన తాడికొండలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పగలు రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండటంతో రాత్రిళ్లు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇటీవల మార్చిన బ్రేకర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా దాదాపు 10 ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమైనట్లు అధికారులు చెబుతున్నారు. మరో వైపు మెయింటెనెన్స్ పేరుతో పొన్నెకల్లు, దామరపల్లి, ఫణిదరం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిలుపుదల చేస్తుండటంతో గత వారం రోజులుగా తమ పరిస్థితి దయనీయంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపేయండి

తాడికొండ: జనావాసాల మధ్య ఇంటిపై జరుగుతున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపేయాలని తాడికొండ చిన్నమసీదు సెంటర్ రెడ్లబజారు వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. 13వ వార్డులోని ఓ ఇంటిపై సెల్‌టవర్ నిర్మాణం చేస్తున్నారని, సెల్‌టవర్ నిర్మాణం వలన సమీప నివాసాల వారికి అనారోగ్య సమస్యలు వస్తాయని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై బుధవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి హరిబాబుతో పాటు పోలీస్‌స్టేషన్, గుంటూరులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం ఆవిష్కరణ, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న వ్యాసరచన, 16న మ్యూజికల్ చైర్స్, 17న పాటల పోటీలు, 18న రంగోళి పోటీలు, 19న మెహిందీ పోటీలు, 20న ఉదయం 10 గంటలకు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

ఫ్రీ ఇసుకకు ఆన్‌లైన్ రసీదు తప్పనిసరి



కొల్లిపర: నది పరివాహక ప్రాంతాల్లో స్థానిక అవసరాల కోసం నదిలో ఫ్రీ గా ఇసుక తరలించే సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్‌లో వినియోగదారుల పేరుతో నమోదు చేసుకుని తద్వారా వచ్చిన ఫ్రీ ఇసుక వేబిల్లు తప్పని సరిగా ట్రాక్టర్ డ్రైవర్ దగ్గర ఉండాలని లోడింగ్, రవాణా సమయంలో పోలీసులు, రెవెన్యూ, ఇతర అధికారులు అడిగిన వెంటనే రసీదు చూపించాలని లేని పక్షంలో అక్రమ ఇసుక రవాణా పై చట్టపరమైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని ఎస్ఐ పి.కోటేశ్వరరావు డ్రైవర్లకు సూచించారు. బుధవారం మండల పరిధిలో కృష్ణా నదిలో ఫ్రీ ఇసుక ద్వారా ఇసుక తరలించడానికి రీచ్‌లు వద్దకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లతో ఆయన ప్రభుత్వం ఫ్రీ ఇసుక విధానంలో పేర్కొన్న విధివిధానాల గురించి వివరించారు. రేపటి నుంచి బిల్లులు లేకుండా వచ్చిన వారిపై అక్రమ ఇసుక రవాణా పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని తిరిగి పంపించారు. లోడింగ్ చేయడానికి వచ్చిన కూలీలకు కూడా తగు సూచనలు, సలహాలు తెలిపారు. వే బిల్లు లేకుండా కూలీలు ఇసుక లోడింగ్ చేయ వద్దని ఆదేశించారు. అలా లోడింగ్ చేసిన ట్రాక్టర్ తోపాటు కూలీలు పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కావున ఇసుక లోడింగ్ సమయంలో కూలీలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సైనేడ్ హత్యల నిందితురాలికి దేహశుద్ధి

తెనాలిరూరల్: వరుస సైనేడ్ హత్యల నిందితురాలికి ప్రజలు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీకి చెందిన తల్లీ కూతుర్లు రమణమ్మ, వెంకటేశ్వరి మరో మహిళతో కలిసి చేసిన సైనేడ్ హత్యలు తీవ్ర సంచలనం రేకెత్తించిన విషయం తెలిసింది. పలువురి వద్ద అప్పులు తీసుకోవడం , తిరిగి చెల్లించే క్రమంలో వారిని నమ్మకంగా తీసుకు వెళ్లి సైనేడ్‌తో చంపేసిన పలు కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారు. సెప్టెంబరులో అరెస్టై జైలుకు వెళ్లిన వీరు సుమారు రెండు నెలల తర్వాత బెయిల్ పై విడుదలై బయటకు వచ్చారు. నిందితుల్లో ఒకరైన వెంకటేశ్వరి మంగళవారం యడ్లలింగయ్య కాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్లడంతో స్థానికులు ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరి జైలు నుంచి రావడంతో యడ్లలింగయ్య కాలనీకి చెందిన పలువురు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వరుస హత్యలకు పాల్పడిన వారు తమ ఇళ్ల మధ్య ఉండటానికి వీల్లేదని, తల్లి కూతుర్ని ఇక్కడి నుంచి పంపించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాను పిల్లలతో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో కొందరు వచ్చి దాడి చేశారంటూ వెంకటేశ్వరి తెలిపింది. తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వివరాలు తెలియజేసింది. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు స్థానికులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు విచారణ చేపట్టినట్లు బుధవారం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299
- బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

- Montessori EM School Lakshmipuram, Guntur. Requires Teachers and Incharges. Cont: 6305028254
- మెస్ ఇన్‌ఛార్జీలు కావలెను. కనీసం 3 సం।।రాలు హోటల్లో లేదా కాలేజీ మెస్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. వంటకు ఉపయోగించే ఆధునిక పరికరాలు అయినా గ్యాస్ స్టీమ్ తిరిగే పరికరాలు, గ్రైండర్లు, చపాతీ తయారీ యంత్రాలు వాడడం తెలిసి ఉండాలి. వయస్సు కనీసం 40 సం।।రాలలోపు ఉండాలి. పనిచేయు ప్రదేశం : గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ, జీతం 25,000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. సంప్ర ✆ 89784 80429
- నూతనంగా ప్రారంభించిన బ్యాంక్ అనుబంధ సంస్థ నందు పనిచేయుటకు VRS, Rtd, వ్యాపారస్తులు కావలెను. జీ+ESI+PF+ ఇన్సెంటివ్స్ -75000/- ✆7013481406
- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818882.
- ప్రముఖ సంస్థ గుంటూరు నందు పనిచేయుటకు మంది విశ్వాసులు డ్రైవర్లు, టెలికాలర్లు, ఆఫీస్ స్టాఫ్, సూపర్‌వైజర్స్, మార్కెటింగ్ ఆఫీసర్లు కావలెను. మంచిజీతం. 63051 22366
- నెల్లూరు జిల్లా ప్రముఖ పవర్ ఇండస్ట్రీ నందు పర్మినెంట్‌గా పని చేయుటకు Ex-ARMY గార్డ్స్ కావలెను. 8గం।। డ్యూటీ,జీతం : 34,000/- ఉచిత వసతి కలదు.77999 27624, 77999 27809.
- గుంటూరు లోని పిల్లల హాస్పిటల్ నందు పనిచేయుటకు(1)Anesthesia Techenician (2) ICU Staff (3) Ward Staff (4) Duty Doctor (5) Receptionist కావలెను. 8885590805
- త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073
- మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్ వ: 18–27, Qly: 10th & అబోవ్, లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd, T.G., కోయంబత్తూర్ (TN) Ph: 7675982065

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాలని మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com